ప్రజాశక్తి
మంగళవారం 7 మార్చి 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

కొండప్రాంతాలు, మురికివాడల అభివృద్ధి విస్మరణ

● విఎంసి నూతన బడ్జెట్ అంచనాలపై సిపిఎం నేత కాశీనాథ్

● సవరించాలని డిమాండ్

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, చిత్రంలో బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ నూతన బడ్జెట్ ప్రతిపాదనలు అభివృద్ధి నిరోధకంగా ఉందని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్లో సోమవారం విఎంసిలో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 9న కౌన్సిల్‌లో అధికార వైసిపి ప్రవేశపెట్టబోతున్న 2023-24 బడ్జెట్లో ప్రకటనలకు, ప్రచార అవసరాలకు రూ.5 కోట్లు కేటాయిస్తే, 40 వేల కుటుంబాలు ఉండే 16 కొండ ప్రాంతాల అభివృద్ధికి కేవలం కోటి రూపాయలు కేటాయించడం దారుణమన్నారు. ప్రస్తుత బడ్జెట్ పద్దుల్లోనే 10 శాతం పెంచి నూతన బడ్జెట్‌ను చూపారని పేర్కొన్నారు. 2022-23 బడ్జెట్, రివైజ్డ్ బడ్జెట్, నూతన బడ్జెట్ రూపకల్పన అంశాలను పరిశీలిస్తే అంకెలు ఘనం, ఆచరణ శూన్యం అన్నట్లుగా ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విఎంసికి గ్రాంట్ల రూపంలో రావాల్సిన వందల కోట్ల నిధులను రాబట్టడంలో అధికార వైసిపి ఘోరంగా విఫలమైందన్నారు. నూతన బడ్జెట్ ప్రతిపాదనల్లో మురికివాడల అభివృద్ధికి ఒక్కపైసా కూడా కేటాయించకపోవడం విఎంసి చరిత్రలో ఇదే మొదటిసారని విమర్శించారు. మౌలిక సదుపాయాల్లేని 16 కొండ ప్రాంత డివిజన్ల అభివృద్ధికి కేవలం కోటి రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఈనేపథ్యంలో ఒక్కో డివిజన్‌కు కోటి రూపాయలు కేటాయిస్తూ బడ్జెట్లో సవరణ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా శిశు సంక్షేమం, ఆస్పత్రుల నిర్వహణకు కేవలం రూ.5 లక్షల చొప్పున నిధులు (మిగతా 6లో)

యథేచ్ఛగా మట్టి, బుసక అక్రమ రవాణా

మొక్కుబడి చర్యలతో అధికారులు సరి

స్వాధీనం చేసుకున్న టిప్పర్లను రెవెన్యూ కార్యాలయం వద్ద ఉంచిన దృశ్యం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అందరూ శాఖాహారులే కానీ బుట్టలో రొయ్యలన్నీ మాయం అయ్యాయనే నానుడి గుర్తుండే ఉంటుంది. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల తీరు ఈ నానుడికి ఏ మాత్రం తీసిపోదనే చర్చ జరుగుతోంది. అక్రమాలను సహించబోమని చెప్పే సంబంధిత శాఖల అధికారులు తీరు ఇదే తరహాలో ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి. కృష్ణాజిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక, మట్టి, బుసక అక్రమ రవాణాను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. తెరవెనుక పెద్దల ప్రమేయంతోనే ఇవి అక్రమంగా తరలిపోతున్నాయనే చర్చ జరుగుతోంది.

బుసక, మట్టి అక్రమ రవాణా ఇలా

మచిలీపట్నం బైపాస్‌రోడ్డు మీదుగా గత కొంతకాలంగా 20 టిప్పర్లలో నిత్యం అక్రమంగా బుసక, మట్టి తరలిస్తున్నారు. పెడన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా భారీగా జరుగుతోంది. గతంలో గూడూరు మండలం తుమ్మలపాలెంలోని వ్యవసాయ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలించారు. అధికారులెవరూ వీటిని అడ్డుకునే సాహసం చేయలేదు. భూయజమాని కోర్టును ఆశ్రయించడంతో ఈ గ్రామంలో అక్రమ తవ్వకాలు నిలిచిపోయాయి. అలాగే బంటుమిల్లి మండలం మలపరాజుగూడెం, రామన్నమోదీ గ్రామాల నుంచి బుసక తరలిపోతోంది. గత కొన్ని రోజులుగా పెడన మండలం నందమూరు నుంచి బుసక అక్రమ రవాణా జరుగుతోంది. నందమూరు గ్రామస్తులతోపాటు సమీప ప్రాంతాల ప్రజలు బుసక అక్రమ రవాణాను వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే మచిలీపట్నం బైపాస్ రోడ్డు మీదుగా వెళుతున్న రెండు బుసక టిప్పర్లను సోమవారం మధ్యాహ్నం రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకుని మచిలీపట్నం రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఈ సంఘటన జరిగిన తర్వాత సైతం పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మచిలీపట్నం బైపాస్ రోడ్డు మీదుగా బుసక రవాణా జరుగుతోంది. అక్రమాలను అరికట్టడానికి చర్యలు తీసుకున్నామని చూపడానికే ఈ బుసక లారీలను తాత్కాలికంగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు (మిగతా 6లో)

విజయవాడ అభివృద్ధిపై కలెక్టర్తో భేటీ ?

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ అభివృద్ధిపై నగరానికి చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం రాత్రి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుతో భేటీ అయినట్లు తెలిసింది. కలెక్టర్ క్యాంప్ జరిగిన ఈ భేటీలో కలెక్టర్‌తోపాటు ఎంఎల్‌ఎలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైసిపి తూర్పు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి దేవినేని అవినాష్, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విజయవాడ సబ్ కలెక్టర్ అతిథిసింగ్ పాల్గొన్నట్లు సమాచారం.

ప్రథమ వర్ధంతి మరియు విగ్రహావిష్కరణ

కీ॥శే॥ పోతురాజు శేషగిరిరావు (శేషయ్య) గారు
గౌడ సంఘం మాజీ అధ్యక్షులు
కొత్తూరు తాడేపల్లి, విజయవాడ రూరల్
నిస్వార్థ ప్రజాసేవకులు, సేవాతత్పరులు, కల్మషమెరుగని మంచి మనిషి, రవాణా రంగంలో ఎంతో మందికి దారి చూపి, ఎందరికో మార్గదర్శకునిగా నిలిచి మరియు గౌడ సంఘం ఉన్నతికై విశేష సేవలందించిన గౌడ సంఘం మాజీ అధ్యక్షులు
కీ॥శే॥ శ్రీ పోతురాజు శేషగిరిరావు (శేషయ్య) గారు
దూరమై సంవత్సరమైననూ మీ జ్ఞాపకాలు మా మదిలో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. మిమ్మలను స్మరించుకుంటూ...
విగ్రహావిష్కరణ : ది. 07-03-2023న కొత్తూరు తాడేపల్లి గ్రామములోని పంచాయితి ఆఫీసు దగ్గర విగ్రహావిష్కరణ జరుగును.
- కుటుంబసభ్యులు మరియు అభిమానులు

శ్రీరస్తు స్వయంభు శుభమస్తు అవిఘ్నమస్తు
శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానము, నెమలి
గంపలగూడెం మండలం, యన్.టి.ఆర్.జిల్లా. ఫోన్ : 08673 - 294633, 294655
ఆహ్వానము
నెమలి గ్రామంలో వేంచేసియున్న
శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవము
ది. 05-03-2023 ఆదివారం నుండి
ది. 10-03-2023 శుక్రవారం వరకు జరుగును.
శ్రీ స్వామివారి కళ్యాణము ది.07-03-2023 శుక్రవారం రాత్రి 10-00 గం.లకు జరుగును.

ది. 05-03-2023 ఆదివారం అంకురార్పణ (పెండ్లి కుమారుని చేయుట)
ది. 06-03-2023 మంగళవారం శేషవాహన మహోత్సవము
ది. 07-03-2023 మంగళవారం రాత్రి 10-00 గం.లకు
శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవము
ది.08-03-2023 బుధవారం రథోత్సవము
ది. 09-03-2023 గురువారం పల్లకీ ఉత్సవము
ది.10-03-2023 శుక్రవారం పవళింపు సేవ
1) శ్రీ స్వామివారి కళ్యాణమునకు పీటలపై కూర్చొనదలచిన దంపతులు రూ.3,116/-లు దేవస్థాన కార్యాలయంలో చెల్లించి తగు రశీదు పొందగలరు.
2) శ్రీ స్వామివారి దేవస్థానములో నిత్య అన్నదాన పథకమునకు రూ. 5,116/-లు ఆ పైన ఎంతైనను చెల్లించినచో అందుపై వచ్చు వడ్డీతో దాత కోరిన రోజున శ్రీ స్వామివారికి పూజ జరిపించి భక్తులకు అన్నదానము జరిపించబడును.
3) శ్రీ స్వామివారికి ప్రతి సోమ, శుక్రవారము, శుద్ధ ఏకాదశి, పునర్వసు నక్షత్రము రోజు మరియు పర్వదినములలో ఉదయం 6-00 గం.లకు విశేష అభిషేకము జరుగును.
4) భక్తమహాశయులందరు శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవములకు విచ్చేసి శ్రీ స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించ ప్రార్థన
శ్రీమతి కావూరి శశిరేఖ, ఛైర్మన్, మరియు ధర్మకర్త మండలి సభ్యులు
శ్రీ స్వామివారి సేవలో...
డి.శ్రీరామవరప్రసాదరావు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి.

గ్రంథాలయం సందర్శన

ప్రజాశక్తి-తిరువూరు: వేసవిలో తిరువూరు శాఖా గ్రంథాలయం మరమ్మతులకు, అభివృద్ధికి కృషి చేయనున్నట్లు గ్రంథాలయ సంస్థ

కష్ణాజిల్లా చైర్ పర్సన్ జమల అన్నపూర్ణమ్మ అన్నారు. సోమవారం గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు ఏమైనా అవసరమైతే ఆన్ డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక గ్రంథాలయాన్ని అన్నపూర్ణమ్మ సందర్శించారు. గ్రంథాలయంలోని వసతులు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి అహ్మద్ పాల్గొన్నారు.

చంద్ర గోవర్ధన్‌కు నివాళి

ప్రజాశక్తి-నందిగామ: అడవిరావులపాడు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, సిపిఎం అభిమాని చంద్ర గోవర్ధన్‌రావుకు ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ మంగళవారం నివాళులు అర్పించారు.

చంద్ర గోవర్ధన్‌రావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నందిగామ పట్టణ శివారు ఆర్.యస్ గార్డెన్స్‌లో జరిగిన చంద్ర గోవర్ధన్‌రావు సంస్మరణ కార్యక్రమంలో ఎంఎల్‌సితో పాటు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చనుమోలు సైదులు, సయ్యద్ ఖాసిం, ఎవి నారాయణ, న్యాయవాది చంద్ర రమాదేవి, చంద్ర వెంకటేశ్వరరావు బాబు, చక్రవర్తి, చంద్ర కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిగ్గులు, హ్యాండ్‌బోర్ సెట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లాలోని రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్ల యజమానులు ఈనెల 10 తేది లోపు రిజిస్టర్, రెన్యువల్ చేసుకోవాలని జిల్లా భూగర్భ జల అధికారి బి. నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర నీరు భూమి చెట్ల చట్టం-2002 , 2004లోని నియమాలను అనుసరించి జిల్లాలోని డిటిహెచ్ రోటరీ మినీ రోటరీ రిగ్గులు మరియు హ్యాండ్ బోర్ సెట్ల యజమానులు ఈనెల 10వ తేది లోగా రిజిస్టర్, రెన్యూవల్ చేసుకోవాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నిబంధనల మేరకు గడువులోగా రిజిస్టర్, రెన్యువల్ చేయని రిగ్గులు హ్యాండ్ బోర్ సెట్లను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని రిగ్గులు హ్యాండ్ బోర్ సెట్ల యజమానులు జిల్లా భూగర్భ జల అధికారి, భూ గర్భ జల మరియు జల గణన శాఖ, గిరి వీధి, సత్యనారాయణపురం లోని కార్యాలయాన్ని సంప్రదించి సత్వరమే రిజిస్టర్, రెన్యువల్ చేసుకోవాలని ఇతర వివరాలను ఫోన్ నెంబర్ 0866-2530244/2972784 ద్వారా తెలుసుకోవచ్చునని జిల్లా భూగర్భ జల అధికారి తెలిపారు.

మహిళలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని రాణిగారితోట సిమెంట్ గోడౌన్ వద్ద స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జి) మహిళలకు పి.ఓ.యు.సి.డి ఆధ్వర్యంలో ఆటల పాటలు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ముగ్గులు, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పి.ఓ.యు.సి.డి శకుంతల, జోనల్ కమిషనర్ కష్ణారావు, సి.డి.ఓ.లు, సోషల్ వర్కర్స్,సి.ఓలు, 18 వ డివిజన్ లో మిషన్ డైరెక్టరు తదితరులు పాల్గొన్నారు.

పోరాడితేనే హక్కులు సాధించుకోగలం

మహిళా దినోత్సవ సదస్సుల్లో వక్తలు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడితేనే మహిళా హక్కులు సాధించుకోగలమని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పలుచోట్ల సదస్సులు నిర్వహించారు. 60వ డివిజన్ వాంబేకాలనీలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఐద్వా డివిజన్ కార్యదర్శి ఎ.రత్నకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి , ఎఎస్ఐ రంజిత, సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను సాధించుకోగలమన్నారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎఎస్ఐ, అమ్మ ఆదరణ సంస్థ అన్నపూర్ణ, ఐద్వా సీనియర్ నాయకులు విజయలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె.పీరూ, బేగం, సత్య, లలిత, లక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వీరులపాడు:** జుజ్జూరు గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కమల, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల మహిళలు నేటికీ అణిచివేతకు, హింసకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారతే ధ్యేయమని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు మహిళలకు కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు చాట్ల రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళపూడి సుందర్రావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కృష్ణవేణి, సిఐటియు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్, చాంద్ బేగం తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** రంగాపురం కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.భవానీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్డిగూడెం ఎంపిపి రామినేని దేవి ప్రవీణ్య వీరస్వామి నాయుడు మాట్లాడుతూ మహిళల అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి, సర్పంచి సునీల, పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరి, మేరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు మరియమ్మ అధ్యక్షత వహించగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఎస్.కుమారి మాట్లాడుతూ మహిళా చట్టాలు అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి ఎం.లక్ష్మి, నాయకులు పి.తులసిరాణి, ఎం.నాగమణి, సిహెచ్.శ్రావణి, పి.నిర్మల, రమణ, లక్ష్మీ, సామ్రాజ్యం, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఎ.కొండూరు:** మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సి.హెచ్.సుప్రజ అన్నారు. రామచంద్రపురం గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా టి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు నేటికీ వివక్షతకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండలం కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయురాలు స్వరూప, యుటిఎఫ్ నాయకురాలు విశ్వభారతి, సిఐటియు పంబి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పానెం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ ఆధ్వర్యంలో కొండపల్లిలోని నాగార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో ఏడు డివిజన్ల నుండి వంద మంది విద్యాసంస్థల మహిళా నిర్వహకులు అసోసియేషన్‌లోని మహిళా సభ్యులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి లయన్ దేవినేని జోనికుమారి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావి శారద, విసిఎస్‌అండ్ టిఫ గౌరవాధ్యక్షులు లయన్ దేవినేని కిషోర్‌కుమార్, ఛైర్మన్ జోనికుమారి, గవర్నింగ్ బాడీ కన్వీనర్ గోన సాంబశివరావు, విద్యాశాకాధికారిణి చెరుకూరి పుష్పలత, లయన్ చెన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి అనుమాటి చెన్నయ్య, వెనిగళ్ళ అమ్మాజీ పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో మాట్లాడుతున్న శ్రీదేవి

ఇబ్రహీంపట్నంలో...

జగ్గయ్యపేటలో బాలుడి ఆచూకీ

ఏడాది క్రితం ముంబయిలో కిడ్నాప్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ముంబయిలో కిడ్నాప్ అయిన బాలుడు ఏడాది తర్వాత ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలోని దేచుపాలెం గ్రామంలో దొరికాడు. జగ్గయ్యపేటలోని ఒక ప్రైవేటు స్కూల్లో చదువుతున్న ఆరేళ్ల బాలుడిని ఆదివారం మహారాష్ట్ర నుంచి వచ్చిన పోలీసులు తీసుకెళ్లిపోయారు. ఎస్ఐ రామారావు తెలిపిన సమాచారం మేరకు ముంబయిలో 2022 ఫిబ్రవరిలో ఒక బాలుడు అదృశ్యమయ్యాడు. దీనిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన మహారాష్ట్ర పోలీసులు తమ విచారణలో విజయవాడకు చెందిన ఓ మహిళ ఆ బాలుడిని తీసుకొచ్చినట్లు గుర్తించారు. ఆ మహిళ జగ్గయ్యపేటలోని మరో మహిళకు బాలుడిని రూ.2 లక్షలకు అమ్మివేయగా, ఆమె దేచుపాలెంలోని తమ బంధువుల కుటుంబానికి రూ.3 లక్షలకు బాలుడిని ఇచ్చేసింది. అప్పటి

నుంచి అదే కుటుంబంలో పెరుగుతున్న ఆ బాలుడిని జగ్గయ్యపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పి చదివిస్తున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో పాఠశాల వార్షికోత్సవం జరుగుతుండగా జగ్గయ్యపేట పోలీసులతో కలిసి వచ్చిన మహారాష్ట్ర పోలీసులు సంబంధిత ఆధారాలు, కేసు పత్రాలు చూపి ఆ బాలుడిని తీసుకెళ్లిపోయారు. ఈ కేసులో విజయవాడకు చెందిన శ్రావణి, మధ్యవర్తిగా వ్యవహరించిన జగ్గయ్యపేటకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.

శేషవాహనంపై వేణుగోపాలుడు

ప్రజాశక్తి-గంపలగూడెం: సుప్రసిద్ధమైన నెమలి శ్రీ వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సుప్రభాత సేవ, ప్రాత కాలార్చనలు, నవకుంబారోపణ, నిత్య హక్షమము, బలిహరణ మంత్రపుష్పము నిర్వహించారు. సాయంత్రం శ్రీ వేణుగోపాలస్వామి వారు శేష వాహనంపై తిరువీధులలో విహరించారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద శ్రీ వేణుగోపాల స్వామి రుక్మిణి, సత్యభామ, అమ్మవార్ల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి విలేకరితో రైస్ మిల్లర్ వాగ్వాదం

ప్రజాశక్తి-తిరువూరు: విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్సుమెంట్ సీఐ వెంకట్రావు, డిటి స్వేత తిరువూరు రాజుపేట ముత్తగూడెం రోడ్డులోని రైస్ మిల్లుపై సోమవారం దాడి చేసి అక్రమంగా నిల్వ వుంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజాశక్తి విలేకరి రైస్ మిల్లు వద్ద సీఐని వివరాలు తెలుసుకున్నారు. మొత్తం ఎన్ని క్వింటాళ్లు అనేవి లెక్కకి రాలేదని, సుమారు 280 క్వింటాళ్లు ఉంటాయని సీఐ తెలిపారు. అనంతరం అధికారు లు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను విలేకరి ఫొటో తీసుకుని వెళుతుండగా రైస్ మిల్లు యజమాని వాగ్వాదానికి దిగాడు. గతంలో కూడా ఇదే రైస్ మిల్లుపై అధికారులు దాడులు. చేసి వేల టన్నుల కోటా బియ్యాన్ని పట్టుకుని యజమానిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దీనితో అతను కొన్నేళ్లు మిల్లు మూతవేశాడు. మళ్లీ తన అక్రమ వ్యాపారానికి అధికారులు అడ్డుపడటంతో జీర్ణించుకోలేక యజమాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని పలువురు పేర్కొన్నారు.

మూలపాడు

జడ్‌పి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు జిల్లాపరిషత్ పాఠశాలలో ఆర్జేడి నాగమణి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను 8వ తరగతి విద్యార్థుల ట్యాబుల పనితీరును, ఉపాధ్యాయుల పని తీరును పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మెనూ గురించి విద్యార్థుల స్పందన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖాధికారి పుష్పలత, సీఆర్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఎంసి భవనాన్ని ఆధునీకరిస్తాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో శిథిలావస్థకు చేరిన భవనాలు ఆధునికీకరిస్తామని ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. సోమవారం నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం ఎఎంసి ఛైర్మన్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏడు అంశాలతో కూడిన అజెండాను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో సెక్రటరీ శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ నల్లమల్లి మురళి, సూపరిండెంట్ స్వప్న, డైరెక్టర్లు తాళ్లూరి భద్రయ్య, చిన్న వెంకటేశ్వర్లు, డక్కమడుగుల బాబు, వేల్పుల అనిత, బొజ్జ సుజాత, హనుమంతు శీను తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-గుడివాడ : నందివాడ మండలం రుద్రపాక గ్రామంలో ఆక్రమణకు గురైన దళిత స్మశాన వాటికను కాపాడాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో గుడివాడ ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని దళిత స్మశాన వాటికను భూస్వాములు ఆక్రమించారని శ్రామిక సర్వేలో తేలిందన్నారు. గ్రామంలో 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని రెండు వైపులా చెరువులు ఉండటంతో చెరువుల ఊట స్మశానంలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మశానానికి సరైన రహదారి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు స్పందించి వెంటనే స్మశానానికి రోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోలిమెట్ల జాన్ అంబేద్కర్, పోలిమెట్ల మరియదాసు, పోలిమెట్ల చిన్నప్ప, గద్దం జోజి, పాలేటి ఫ్రాన్సిస్, చిగురుపాటి తంబి, నక్క జ్ఞాన సుందర్రావు, నున్న హదయం, బిఎస్పి నాయకులు దారం కరుణాకర్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

జడ్‌పిటిసి ఎన్నికకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండలంలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఎంపీడీవో వి. ఉమాదేవి సోమవారం విడుదల చేశారు. 11గ్రామాల్లో 33 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వివరాలతో కూడిన డ్రాఫ్ట్ విడుదల చేసి నోటీస్ బోర్డులో ఉంచారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు స్వీకరిం చేందుకు అన్నిరాజకీయపార్టీలతో మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపిటిసి, వార్డు సభ్యుల ఎన్నికకు డ్రాఫ్ట్ జాబితా ప్రచురణ

ప్రజాశక్తి-గన్నవరం : ఉంగుటూరు మండలం తేలప్రోలు -1 ఎంపిటిసి సభ్యుల ఎన్నిక కోసం సోమవారం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా ప్రచురించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల తేలప్రోలు గ్రామ పంచాయతీ 4వ వార్డు, గారపాడు గ్రామ పంచాయతీ 8వ వార్డు, ఎన్.ఎ పేట గ్రామ పంచాయతీ 4వ వార్డు, తుట్టగుంట గ్రామ పంచాయతీ 5వ వార్డు ఎన్నిక నిర్వహణ నిమిత్తం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా ప్రచురించామని, ఏదైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 7వ తేదీలోపు తెలపాలన్నారు. పదో తేదీ తుది పోలింగ్ స్టేషన్ జాబితా ప్రచురిస్తామని, అభ్యంతరాలపై ఈనెల 7వ తేదీన అన్ని రాజకీయ పార్టీలకు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున అన్ని రాజకీయ పార్టీలు హాజరు కావాలని కోరారు.

బూసిమ్మకు బోణం సమర్పణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ముదునూరులో జరుగుతున్న కూరాకుల సుబ్బయ్య, బూసిమ్మ పేరంటాల తిరునాళ్లలో భాగంగా సోమవారం అమ్మవారికి గ్రామ సర్పంచ్ మొవ్వ వెంకటనాగలక్ష్మి జ్ఞానశేఖర్ దంపతులు బోణం సమర్పించారు. అమ్మవారి పుట్టినింటి నుండి సారె, పసుపు కుంకుమతో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి బోణం సమర్పించారు. ఈనెల 2న ప్రారంభ మైన తిరునాళ్ల 12న శిడిబండి ఉత్సవం నిర్వహించి 16వ తేదీతో ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

కిడ్నీ వ్యాధి చికిత్సకు సాయం అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఇటీవల వివాహమైన యుగంధర్, అవంతిక దంపతులలో అవంతికకు రెండు కిడ్నీలు పాడైపోయాయని వైద్యులు నిర్ధారించడంతో కూలికి వెళ్తే గాని పూటగడవని పరిస్థితి భార్య అనారోగ్యం భర్త యుగంధర్ ను కంగదీసింది. ఖర్చుతో కూడుకున్న వైద్యం కావడంతో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ 50,000 వేలు, ఎన్నారై జనసైనికులు 50,000 వేలు, ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ 2000 రూపాయల నగదు మొత్తం లక్ష రూపాయల చెక్కుతో పాటు 2000 రూపాయల నగదును యుగంధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, నెలకుర్రు సర్పంచ్ బొమ్మ సాని నరేష్, పెదయాదర సర్పంచ్ గళ్ళతిమోతి,వడ్డీ చిరంజీవి, జనసేన నాయకులు డివిజన్ ఇన్చార్జిలు జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.

మహోత్సవంలో అసౌకర్యం కలగకుండా చర్యలు : డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి మహబూబ్ బాషా

ప్రజాశక్తి కోడూరు : కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి మంగళవారం విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అవని గడ్డ డిఎస్పి మహబూబ్ బాషా అన్నారు. సోమవారం విశ్వనాధపల్లి గ్రామంలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ ఈ జాతర మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు కావున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కోడూరు ఎస్సై రాజేంద్రప్రసాద్, ఆలయ చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు ఆలయ కార్య నిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పరుగు పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : శ్రీ శ్రీనివాసా డిఫెన్స్ అకాడమీ అవనిగడ్డ మిలిటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవనిగడ్డ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో కానిస్టేబుల్ ప్రిలిమినరీ క్వాలిఫై అయినా విద్యార్థిని విద్యార్థులకు 1600 మీటర్లు 100 మీటర్లు పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్ హైట్ వెయిట్ చెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తో పాటు అతిథులుగా డీఎస్పీ మహబూబ్ బాషా సీఐ జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ తుంగల సుమతిదేవి, పీఈటీలు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

'స్వచ్ఛ చల్లపల్లి'కి విరాళం అందజేత

ప్రజాశక్తి- చల్లపల్లి : స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల సేవలు ఆదర్శనీయం అని విశ్రాంత పంచాయతీ ఉద్యోగి కంఠంనేని రామబ్రహ్మం అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహణకు చల్లపల్లి మండలం పాగోలు గ్రామానికి చెందిన రామబ్రహ్మం రూ. లక్షా ఐదు వేలు విరాళాన్ని చెక్ రూపంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాదుకు సోమవారం అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ టీ.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో ఉచిత కంటి శుక్లముల వైద్యశిబిరం, ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు మోహనరావు 60మందికి కంటి పరీక్షలు చేసి 18 మందిని శుక్లముల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఉచిత హోమియో వైద్య శిబిరంలో హోమియో వైద్యులు మణికంఠ 40మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ అందచేశారు. ఈ శిబిరాలను క్లబ్ అధ్యక్షులు గోళ్ళ ద్రోణ పూర్ణచంద్ర రావు, హరిగోపాల్, సతీష్, నరేంద్ర, కిరణ్ పర్యవేక్షించారు.

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి :ఎస్ఐ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం) : నేటి సమాజంలో అభివృద్ధి చెందిన సాంకేతికతను ఉపయోగించి జరుగుతున్న మోసాలపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ భారతీయ శిక్షా స్మృతి లోని సెక్షన్లను తెలిసికొని ఉండాలని హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపారు. స్థానిక బాపులపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 'విద్యార్థుల క్రమశిక్షణ పాఠశాల పాత్ర' అనే అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువులో రాణించాలని, తద్వారా పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతేవాలని సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండి పాఠ్యాంశాల పట్ల పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రమీలారాణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా మహిళా సమైక్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సమైక్య నాయకులు మాట్లాడుతూ ఒకేసారి వంట గ్యాస్ పై 50 రూపాయలు పెంచితే ఆ ప్రభావం నిత్యవసర వస్తువుల ధరలు పడుతుందని, తద్వారా ధరలు ఆకాశాన్ని అంటి పేద మధ్యతరగతి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే వాణిజ్య సిలిండర్ ధర 350 రూపాయలు ఒకేసారి పెంచడం వల్ల స్వయం ఉపాధి పొందుతున్న వారు చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని కాబట్టి పెంచిన ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సమైక్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి ,సహాయ కార్యదర్శి ఒడుగు రత్నకుమారి ,సిపిఐ పార్టీ బందరు నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ లు ఉన్నారు.

లూర్దుమాత మహోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గుడివాడ : 130 సంవత్సరాల చరిత్ర కలిగిన వెన్ననపూడి లూర్దుమాత మహోత్సవాలను విజయవంతం చేయాలని వెన్ననపూడి విచారణ గురువు ఫాదర్ ప్రశాంత్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 9,10,11 తేదిలలో నందివాడ మండలం వెన్ననపూడిలోని లూర్దుమాత మహోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. 130 సంవత్సరాల క్రితం వెన్నపూడిలో లూర్దుమాతగా మరియతల్లి దర్శనం ఇచ్చారన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మందికి తల్లి మరియ చేసిన అద్భుతాలు అనేక ఉన్నాయన్నారు. అందుకే దేశ విదేశలలో ఉన్న ఈ ప్రాంతానికి చెందిన వారు తప్పని సరిగా ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. ఈ ఉత్సవాలకు 3రోజులలో సుమారు 3 లక్షలమంది భక్తులు పాల్గొంటా రన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ధర్మవిజయం, సిలువధారి, దనవంతుడు లాజర్ అనే గొప్ప బైబిల్ నాటకలను ప్రదర్శిండం, ఈ నెల 11వ తేది విజయవాడ పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు సమిష్టి దివ్యపూజాబలి సమర్పిస్తారన్నారు.



విలేకర్లుతో మాట్లాడుతున్న ఫాదర్ ప్రశాంత్

పెరుగుతున్న ధరలను నియంత్రించాలని ధర్నా

ప్రజాశక్తి-వీరులపాడు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెరిగిన ధరలను తగ్గించాలని కోరుతూ తాసిల్దార్ ఆశయనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చాట్ల రవి, కోడూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ రమేష్, ప్రభాకర్, సిపిఐ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అర్థశాస్త్రంలో కిషోర్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ కారుమూరి కిషోర్ కుమార్‌కు ఆచార్య నాగార్జున

విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కానూరులో నివాసం ఉంటున్న కిషోర్ కుమార్ 'ఆధార్ అనుసంధానంతో రేషన్ సరుకుల పంపిణీ వల్ల రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంశాలపై ప్రభావం' అనే అంశంపై పరిశోధనకు ఆర్థిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్‌ను వర్శిటీ ప్రదానం చేసింది. ప్రముఖ ఆర్థిక వేత్త డాక్టర్ రాజశేఖర్ వద్ద పరిశోధన చేసినట్లు కిషోర్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా కిషోర్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రకటించడం పట్ల పలువరు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పారిశ్రామికీకరణతో ఉపాధి అవకావాలు : తోట

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమలు విరివిగా

రానున్నాయని, ఫలితంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉదయం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రం తీర ప్రాంతం విస్తారంగా ఉండటంతో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. కార్పొరేట్ రంగంతో పాటు ప్రభుత్వ రంగంలోని పలు సంస్థలు కూడా ముందుకు వచ్చి పరిశ్రమల స్థాపనకు హామీ ఇవ్వడ రాష్ట్రం పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తుందన్నారు. మొదటి రంగం వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని కూడా అనుసంధానం చేస్తూ పరిశ్రమల స్థాపన జరుగుతుందన్నారు. పరిశ్రమల విస్తరణ పట్టణాలతో పాటు పల్లెలకు కూడా చేరుతుందని విద్యావంతులైన యువకులు ప్రతి ఒక్కరికీ ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సుమారు వెయ్యి మంది విద్యార్థులకు సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జామినేషన్ ప్యాడ్లు, పెన్నులను సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో సుజనా ఫౌండేషన్ ఇంచార్జి వీరమాచినేని కిషోర్, జగ్గయ్యపేట నియోజకవర్గం ఇన్చార్జి ఇంతియాజ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో సోమవారం వాసవి కపుల్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఈ

కార్యక్రమంలో కౌన్సిలర్ నూకల సాంబ, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ, వాసవి కపుల్స్ ప్రెసిడెంట్ కొత్త రమేష్ కుమార్, సెక్రెటరీ పెనుమూరి సత్యనారాయణ, కోశాధికారి గోనుగుంట్ల ధనుంజయ, వాసవి కపుల్స్ గౌరవ అధ్యక్షులు కొత్త పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాల జాడేదీ?

ప్రజాశక్తి-విజయవాడ రూరల్

రూరల్ గ్రామాలకు నాగార్జున సాగర్ జలాలు రావడం దయనీయంగా మారింది. రెండు దశాబ్దాలుగా సాగర్ కాల్వ నిరుపయోగంగా ఉంది. నూజివీడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో మాచవరం మేజర్ కింద నున్న, కుందావారి కండ్రిక, పాతపాడు, నైనవరం, జక్కంపూడి మేజర్ కింద జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లిలో ఆయ కట్టు ఉంది. ఏటా అక్టోబరు, నవంబరులో సాగర్ కాల్వకు ఎన్ఎస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తారు. ఇరవై సంవత్సరాలుగా రూరల్ గ్రామాల రైతులు సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్నా నీటిని విడుదల చేయడం లేదు. పలు గ్రామాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. ఏటా డిసెంబరు, జనవరి నెలల్లో రైతులు తోటలకు నీళ్ల పెట్టుకునే వారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో ట్యాంకర్లతో నీటిని పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం సాగర్ కాల్వ పూర్తిగా ముళ్ల పొదలు,

నిరుపయోగంగా ఉన్న సాగర్ కాలువ

చెత్తాచెదారంతో నిండిపోయింది. గత ప్రభుత్వ హయాంలో కాల్వ అభివృద్ధికి చర్యలు చేపడతామని అధికారులు చెప్పినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పలుమార్లు రైతులు ఎన్ఎస్పీ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగర్ కాల్వను అభివృద్ధి చేయడంతో పాటు నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి శ్రీ తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలు మంగళవారం నుండి ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు మంగళవారం అఖండ జ్యోతి స్థాపన, రెండోవ రోజు బుధవారం రాత్రి శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గ్రామోత్సవం (రథోత్సవం), మూడో రోజు గురువారం ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పుట్టినిల్లు అయిన అనిగండలపాడు గ్రామ నుంచి అమ్మవారి ఆలయానికి భారీ ఊరేగింపులతో పుట్టింటి పసుపు కుంకుమ మహోత్సవం, నాలుగో రోజు శు క్రవారం అమ్మవారి దివ్య ప్రభోత్సవం, ఐదవ రోజు శనివారం బోనాలు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐదు

రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఆలయం వద్ద వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, యువకులను ఉత్సాహపరిచేందుకు ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు ఆలయ అధికారులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ లీలా కుమార్, చైర్మన్ చెన్న కేశవరావు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు వినతి

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: నగరంలో వీధికుక్కలను నియంత్రించాలని కోరుతూ సోమవారం స్పందనలో విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు విజయవాడ పౌర సంక్షేమ సంఘం సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి భూపతి రమణారావు మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా నివారణకు చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్నారు. వీధుల్లో తిరగాలంటే పిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె పీరు సాహెబ్, పి.సాంబిరెడ్డి, యు.శివలింగేశ్వరరావు, పిఎస్ఎన్ మూర్తి, ఎం.రాము, అప్పన్న, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు డిమాండ్ చేశారు. తిరువూరులోని సుంకర వీరభద్రరావు భవనంలో సమాఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టుల భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపి శాఖల్లో ఎన్ని ఖాళీ పోస్టులు ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పలువురికి ఉమా పరామర్శ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని టిడిపి నేతల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. నియోజకవర్గ మైనారిటీ అనుబంధ విభాగ అధ్యక్షులు షేక్ ఖాజా సతీమణి ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు యువత నాయకులు చావా సతీష్ తండ్రి చిట్టిబాబు అనారోగ్యంతో బాధపడుతుండగా వారి స్వగృహంలో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సింగ్ బ్రదర్స్‌ల అమ్మమ్మ రాధమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వేగా జ్యూయలరీ టీజర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

వేగా జ్యుయలర్స్ ప్రారంభోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద గల ట్రెండ్ సెట్ మాల్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సంస్థ డైరెక్టర్లు వనమా నవీన్, సుధాకర్ మాట్లాడుతూ వేగా జ్యుయలర్స్ ప్రచారకర్తగా హీరో బాలకృష్ణ వ్యవహరిస్తున్నారని ఆయనతో ప్రత్యేకంగా షూట్ చేసిన టీజర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన లబ్బీపేటలోని నందమూరి రోడ్డులో షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వేగా జ్యుయలర్స్ వివిధ ఆభరణాలను అందిస్తూ ఎంతో మంది ఖాతాదారుల అభిమానం పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం నగరంలో విస్తృతస్థాయిలో అతి పెద్ద షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని వర్గాల వారికి ఆభరణాలను అందిస్తున్నామని తెలిపారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా పలు రాయితీలను ఖాతాదారులకు అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విఎంసి స్పందనలో 24 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ

సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల వద్ద నుంచి మొత్తం 24 అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉత్పత్తులకు అమెజాన్ భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకుగాను అమెజాన్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా పారిశ్రామివేత్తల కోసం గ్లోబల్ ఇంక్యుబేటర్ ఉమెన్నోవేటర్‌తో అనుబంధాన్ని ప్రకటించినట్లు తెలిపారు. దీని ద్వారా ఇక్కడి ఉత్పత్తులకు ఇతర ప్రాంతాలకు అవసరమైతే ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసుకునేవిధంగా ఉమెన్నోవేటర్ కృషి చేస్తుందన్నారు. మహిళా ఉత్పత్తులకు చక్కటి మార్కెటింగ్ సౌకర్యం కల్పించమే ధ్యేయం అన్నారు.

సాగునీరు విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి-నందిగామ

సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి ఆధ్వర్యంలో రైతులు సోమవారం సాగర్ కాలవల వద్ద ధర్నా చేశారు. కాలువలు ఎండిపోయి బీటలు వారి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నందిగామ మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో పొక్కునూరు మైనర్ వద్ద రైతులు చేస్తున్న ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి, విజయ డైరీ డైరెక్టర్ నెలకుదుటి నాగేశ్వరావు, నాయకులు ఇంటూరి సీతయ్య, మార్తా లక్ష్మీ నరసయ్య, విష్ణు, రామచంద్రరావు, ఈపూరి నాగేశ్వరరావు, చిరుమామిళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్

అనారోగ్యంతో అను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 64వ డివిజన్ టిడిపి బీసీ నాయకులు మరీదు దుర్గాప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, 64వ డివిజన్ అధ్యక్షుడు పరసా అశోక్‌గౌడ్, డివిజన్ ఇంచార్జ్ పలగాని అశోక్ గౌడ్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బెజవాడ తిరుపతిరావుగౌడ్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో మహిళలు ముందడుగు : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : లింగ సమానత్వం కోసం సాంకేతికత, ఆవిష్కరణ ప్రధాన అంశంతో ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న జరుపుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణాజిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ పెరెడ్ గ్రౌండ్స్ ఇండోర్ స్టేడియంలో వివిధ శాఖల జిల్లా మహిళాధికారులకు నిర్వహించిన ఆటలను జేసి ప్రారంభించి కొద్దిసేపు షటిల్ ఆడి మహిళల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక వంటి వినియోగించడంలో మహిళలు జిల్లాలో చాలా ముందడుగు వేశారన్నారు. ఏఎన్ఎం, మహిళా పోలీస్, అంగన్వాడీ టీచర్స్ వారి విధులలో భాగంగా సాంకేతికత వినియోగిస్తూ నివేదికలు ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా ఉపాధ్యా యులు పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్స్ ద్వారా విద్యాభోదన చేస్తున్నారన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో స్థానిక క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సర్కార్ తోటలో స్విమ్మింగ్ ఫూల్, జిమ్ము ఉచితంగా మహిళలకు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ పీడి

ఎస్.సువర్ణ, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జాన్సీ లక్ష్మీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ అమ్మవారి జాతరకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కోడూరు మండలం విశ్వనాథ పల్లి గ్రామంలో వేంచేసి ఉన్న అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి రేపల్లె నుండి అవనిగడ్డ నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ సోమ, మంగళవారాల్లో ఈ బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు చెప్పారు ఈ బస్సులను సాధారణ చార్జీలతోనే నడుపుతున్నామని తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ సిఎస్ఆర్ ఫండ్ నుంచి రూ.37 లక్షలు ఇవ్వాలి

- కలెక్టర్‌కు బుద్ధవరం సర్పంచ్ వినతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానాశ్రయ విస్తరణలో వివిధ రకాలుగా నష్టపోయిన బుద్దవరం గ్రామపంచాయతీలో వివిధ అభివద్ధి పనులు చేయుటకు ఎయిర్ పోర్ట్ సిఎస్ఆర్ ఫండ్ నుండి రూ.37 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు సర్పంచ్ బడుగు బాలమ్మ సోమవారం వినతిపత్రం పంపారు. వినతి పత్రంలోని వివరాలను ఆమె వివరించారు. బుద్దవరం గ్రామం పరిధిలో ప్రభుత్వం విమానాశ్రయ అభివద్ధి, విస్తరణ నిమిత్తం 353.60 ఎకరాలు భూమిని భూ సేకరణ క్రింద సేకరించిదన్నారు. సదరు భూసేకరణ వలన బుద్ధవరం గ్రామానికి పలు ఇబ్బందులు కలిగాయని, విమానాశ్రయ విస్తరణ వలన గ్రామంలో కలిగిన నష్టం, గ్రామ అభివద్ధి నిమిత్తం కావలసిన నిధులు ఎయిర్పోర్ట్ వారి సి.యస్.ఆర్ ఫండ్ నుండి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ సదరు పనుల హామీలు అమలు ఇంతవరకు అమలు జరగ లేదని, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.

రైతులకు ధృవీకరణ పత్రాలు మంజూరు

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలంలోని సుమారు 7700 మంది రైతుల షరతుల గల పట్టాలు కలిగిన వారికి ప్రభుత్వం షరతులు ఎత్తివేసినప్పటికీ వారు రిజిస్ట్రేషన్ ల కోసం ఇబ్బంది పడుతున్నారని వారందరికీ కోడూరు మండలం తాసిల్దార్ కార్యాలయం నుంచి ధృవీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సోమవారం కోడూరులోని టిటిడి కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, దివి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు పాల్గొని రైతులకు పొలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న షైనీ, ఉల్లిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ వెర్రి పావని, కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్య నారాయణ, ఎంపిటిసి బడే హేమగంగాధర్, కోడూరు వైస్ సర్పంచ్ ఇంకొల్లు మురళి, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, వెన్నా ప్రసాద్, తహసీల్దార్ ఎస్కే లతీఫ్ పాషా, వైసిపి రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకట నారాయణరావు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరి కళ్యాణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - మొవ్వ : శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 260వ వార్షిక కల్యాణోత్సవ వేడుకలు సోమవారం వేకువఝామున వైభవంగా నిర్వహించారు. శాశ్వత ఉభయ దాతలు ఏలేశ్వరపు వెంకట రమణమూర్తి.. శైలజ దంపతులు ఈ వేడుకలను నిర్వహించారు. పూర్ణ దీక్షాపరులు రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి బ్రహ్మత్వంలో కొనసాగిన ఈ కార్యక్రమానికి విజయవాడకు చెందిన పురోహితులు జోశ్యుల హనుమత్ కృష్ణ ప్రసాద్, అర్చకులు పెనుమూడి బాబురావు, పూర్ణ చంద్రశేఖర శర్మ, సతీష్ కుమార్ శర్మ,నాగ నరేంద్ర శర్మలు సహకరించారు. అనంతరం కళ్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అన్న సమారాధన చేశారు. రాత్రికి పూజాకార్యక్రమాల అనంతరం

రథోత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా జరిపారు. బ్రహ్మ రథం పై విశేష అలంకరణ మధ్య ఆశీనులైన కళ్యాణోత్సవ ఆదిదంపతులకు భక్తులు దారిపొడవునా ఆనందకర్పూర నీరాజనాలందించి భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

జెసికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : మిగిలిన ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులకు ఆత్మ హత్యలే శరణ్యం అని ఘంటశాల మండలం, ఘంటశాల గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండలం లో, ఆర్.బి.కె. ద్వారా ధాన్యం కొనుగోలు నిలిపివేసి యిప్పటికి సుమారు నెల రోజులు పైన అయ్యిందని, అప్పటి నుండి రైతులు నానా అగచాట్లు పడుతున్నారన్నారు. 75 కేజీలకు 1545 రూపాయల గిట్టుబాటు వున్న ధరను రైసు మిల్లర్లు 13 లేక 14 వందలకు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు భారీగా నష్టపోతున్నరన్నారు. రైతు ఎకరానికి రూ.45 వేల రూపాయలను ఖర్చు చేసి పంట పండిస్తే సగటున 30 బస్తాలకంటే ఎక్కువగా పండుట లేదన్నారు. మరో వైపు ప్రకతి వైపరీత్యాల వలన కలిగే నష్టములన్నింటిని భరిస్తూ కోత కోసి, కుప్పులు వేసి, మాసూలు చేసేటప్పటికీ ధాన్యం కొనుగోలును నిలిపివేసినట్లు ఆర్.బి.కె. వారు చెబుతున్నారన్నారు. కావునా మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు శివ నాగేంద్రరావు, వాకా రామచంద్ర రావు, పలువురు రైతులు ,కొలు రైతులు పాల్గొన్నారు. ఘంటశాల మండల రైతులు, కౌలురైతులు ఏ.విజయ్ కుమార్ ,జి.చంద్రశేఖరావు, సురేంద్ర, పి .చంద్రశేఖరావు,కె.రంగారావు,పలువురు రైతులు ఉన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను సద్వినియోగం చేసకోవాలి

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి కొనసాగిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఇంటి వద్దకే వైద్యుడు) విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అరబిందో కంపెనీ 104 మచిలీ పట్నం డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్ళు అన్నారు. కోడూరు మండలంలోని కోడూరు-1 సచివాలయ పరిధిలోని వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, 104 సంచార వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి -2 పార్వతి తో మాట్లాడి ఫ్యామిలీ పిజిషన్ కాన్సెప్ట్ గురించి పేద ప్రజలకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ఉదయం పూట శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించి సాధారణ ఇబ్బందులతో పాటు బిపి, షుగర్ వ్యాధులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. మధ్యాహ్నం పూట ఇంటికే పరిమితం అయిపోయి ఉన్న రోగులను గుర్తించి వారి ఇండ్లకే వైద్య బందం వెళ్లి సేవలందిస్తుండడంపై ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి గంగారత్నం, ఏఎన్ఎం లు ఉదయశ్రీ, లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

‘లక్ష్య’ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

- ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు

ప్రజాశక్తి-కోడూరు : వినూత్నంగా ఆలోచించి కొత్త పద్ధతులతో సైన్స్‌లో ప్రయోగాలు చేసి శాస్త్రవేత్తలకు తామేమీ తక్కువ కాదంటున్న లక్ష్య స్కూల్ విద్యార్థులు చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్లో ఎంతోమంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని వారందరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి టివిఎం రామదాసు అన్నారు. కోడూరు మండలంలోని లక్ష్యా స్కూల్ లో సోమవారం మంగళ వారం జరుగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి టివియం రాందాస్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి సైన్స్ ఎగ్జిబిషన్ ని ప్రారంభించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో 250 మంది స్టూడెంట్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ బేస్డ్ ప్రాజెక్ట్స్ చేసి వచ్చిన ముఖ్య అతిథి మరియు అతిథులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ప్రగతి విద్యాసంస్థల అధినేత ఎస్. పూర్ణచంద్రరావు నవజీవన్ స్కూల్ కరస్పాండెంట్ కే.ఈశ్వర్ రావు ఎన్నారై వికాస్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేష్, విద్యానికేతన్ కోసూరు పాలెం కరస్పాండెంట్ ధర్మ ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఈ ఎగ్జిబిషన్లో పాల్గొన్నారు. ప్రాజెక్టులు రూపొందించి వాటిని చక్కగా వివరించిన విద్యార్థులను ఎగ్జిబిషన్ కి వచ్చిన అతిథులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. మంగళయాన్ రాకెట్, పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి, డైనోసార్, వైర్లెస్ పవర్ ట్రాన్స్మిషన్, ఆటోమేటిక్ రోడ్డు డివైడర్, వాటర్ ఎక్స్ట్రాక్టర్ ఫ్రొం ఎయిర్, ఆటోమేటిక్ పొల్యూషన్ కంట్రోలర్, యాక్వపోనిక్స్, కెమికల్ ఎక్స్పరిమెంట్స్, ఆర్ట్ గ్యాలరీ ఈ ఎగ్జిబిషన్లో హైలెట్గా నిలిచి వచ్చిన అతిథులని ఆకర్శించాయి. ఈ కార్యక్రమంలో లక్ష్య స్కూల్ చైర్మన్ విస్సంశెట్టి శివ నాగరాజు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు సాయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన షేక్ పర్వీన్ పిల్లలను ఆదుకునేందుకు

విజయవాడ పటమట 14వ డివిజన్‌కు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) విజయవాడ తూర్పు సిటీ కోశాధికారి ఎనమల ఏడుకొండలు, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తాపీమేస్త్రీ కె.మస్తాన్, సీతయ్య, కర్నాటి వెంకటేశ్వరరావు ముందుకు వచ్చారు. భర్త మద్యానికి బానిసకావడంతో నలుగురు పిల్లల పోషణ కష్టంగా మారి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆమె గత ఏడాది డిసెంబరు 24న బందరు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ అనాథ పిల్లకు పెద్దదిక్కుగా ఉన్న అమ్మమ్మకు నిత్యావసర సరుకులు అందిజేశారు. అంతేగాక ఆర్థిక సహాయంతోపాటు ఆ పిల్లలను చదివించేందుకు దాతలు ముందుకు రావాలని కరపత్రాలు, పేపర్ ప్రకటనలతో ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వారిని ఆదుకోవాలని కోరారు. దాతలు 9394759608, 9848031038 ఫోన్ నెంబర్లలో తమను సంప్రదించవచ్చని వై.ఏడుకొండలు, వి.బి.రాజు పేర్కొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజారాం, చిత్రంలో రాము, లక్ష్మి, సాయి కృష్ణ

'అజయ్'స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని 31వ డివిజన్ ముత్యాలంపాడులో గల అజయ్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజారాం, ప్యానల్ అడ్వకేట్ పి.రాము, ఆడపిల్లలు, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఏపుగంటి లక్ష్మీ అపర్ణ, ఏపుగంటి సాయి కృష్ణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి హస్తకళలను ప్రోత్సహించండి : విజయలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : లేపాక్షి ఉత్పత్తులను ఆదరించి హస్తకళాకారులను ప్రోత్సహించాలని లేపాక్షి చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి కోరారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపమైన లేపాక్షి హస్తకళాకతులు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంజి రోడ్ లోని బాపు మ్యూజియంలో నిర్వహిస్తున్న లేపాక్షి థీమేటిక్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆమె లేపాక్షి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వతో కలిసి పరిశీలించారు.

మొదటి పేజీ తరువాయి

కొండప్రాంతాలు, మురికివాడల అభివృద్ధి విస్మరణ

కేటాయిస్తే ఈ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. నగరంలో శిధిలావస్థకు చేరిన బ్రిడ్జిలు, సబ్‌వేల నిర్మాణం, స్వచ్ఛ భారత్ పనులు, గ్రీనరీ అభివృద్ధి, ఎస్‌సి, ఎస్‌టి, పేదల బస్తీల అభివృద్ధి పనులకు, అర్బన్ హెల్త్ సెంటర్ల మౌలిక సదుపాయాల కల్పన, స్టేడియంలో క్రీడా సామాగ్రి కొనుగోలు, మహిళా వికాస కేంద్రాల నిర్వహణతోపాటు అనేక పద్దులకు ఏ విధమైన కేటాయింపులు జరగలేదన్నారు. క్యాపిటల్ ఆదాయాల్లో ఎపి గ్రాంట్ 2022-23 బడ్జెట్ అంచనా రూ.100 కోట్లలో కేవలం రూ.31.54 కోట్లు (31 శాతం) మాత్రమే వస్తుంటే, 2023-24 బడ్జెట్లో రూ.110 కోట్ల అంచనాకు ప్రాతిపదిక ఏమిటని ప్రశ్నించారు. వీధి వ్యాపారుల అభ్యున్నతికి 2020-21 నుంచి ఇప్పటి వరకు జరిగిన మూడు బడ్జెట్ సవరణ అంచనాల్లో జీరో చూపి, నూతన బడ్జెట్లో రూ.20 లక్షలు ఏ ప్రాతిపదికన చూపారని ప్రశ్నించారు. ఇప్పటికైనా నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అంచనాల్లో సవరణ చేసి తగిన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ గత బడ్జెట్‌కు, నూతన బడ్జెట్‌కు కేటాయింపుల్లో పొంతన లేదన్నారు. బడ్జెట్లో రూ.1372 కోట్ల ఆదాయం, రూ.1419 కోట్ల మేర ఖర్చులను చూపారని పేర్కొన్నారు. రూ.150 కోట్ల మేర భారాలు మోపారని అన్నారు. రూ.462 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రైనేజి పథనం నిధులు రూ.282 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేయకపోవడం విఎంసి వైఫల్యమేనని విమర్శించారు. ఎప్పుడో ముగిసిపోయిన జెఎన్ఎన్‌యుఆర్‌ఎం పథకం కింద మంజూరైన పనులకు రూ.60 కోట్లను జనరల్ ఫండ్ నుండి మళ్లించడం దారుణమన్నారు. మురికివాడలు, కొండ ప్రాంతాల అభివృద్ధి, ప్రాధాన్యతా రంగాలకు నూతన బడ్జెట్లో అంచనాలను సవరించి తగిన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా మట్టి, బుసక అక్రమ రవాణా

తరలించారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో జరిగిన విధంగానే నామమాత్రంగా జరిమానాలు విధించి టిప్పర్లు వదిలేస్తారనే చర్చసాగుతోంది. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని నందివాడ మండలం పుట్టగుంట సమీపంలోని బుడమేరు నుండి గుడివాడ ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా ప్రయివేటు రియల్ వెంచర్లకు ఇటీవల అక్రమంగా మట్టి తోలకాలు సాగించారు. వీటిపై ఆర్‌డిఒ, పోలీసు, రెవెన్యూ శాఖలకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మట్టితోలకాలు తమ పరిధిలోకి రాదని చెప్పిన అధికారులు తొలుత చర్యలకు నిరాకరించారు. తప్పని పరిస్థితుల్లో మూడు లారీలను స్వాధీనం చేసుకుని నామమాత్రంగా జరిమానా విధించి వదిలేశారు. బుడమేరు మట్టి అమ్ముకుని అక్రమార్కులు కోట్లాది రూపాయలు కూడబెట్టుకున్నారు. జగనన్న లే అవుట్ల మాటున బందరు నియోజకవర్గం మంగినపూడి, తపిశపూడి, బుద్దాలపాలెం నుంచి బుసక పెద్దఎత్తున రియల్ వెంచర్లకు తరలిపోయింది. అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక మండలం నాలి, అవనిగడ్డ మండలం పాతఎడ్లంక ప్రాంతాల నుంచి కూడా భారీగా బుసక, మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. మోపిదేవి మండలం ఉత్తర చిరువోలులంకలో సిఆర్‌జడ్ పరిధిలో తవ్వకాలు జరిగినా అధికారులు స్పందించలేదు. స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలింగా తవ్వకాలు నిలిచాయి. తాజాగా నాగాయతిప్ప, పోసిగానిలంక ప్రాంతాల్లో తవ్వకాలు ప్రారంభించేందుకు అక్రమార్కులు సిద్ధమయ్యారు. అవనిగడ్డ నియోజకవర్గంలోనూ జగనన్న కాలనీల లే అవుట్లను మెరక చేసే పేరుతోనే భారీగా బుసక, మట్టి రవాణా జరుగుతోంది. అయితే లే అవుట్ల మెరకకు వెళ్లే మట్టి, బుసక కన్నా ప్రయివేటు వెంచర్లకు తరలిపోతోందే ఎక్కువగా ఉంది.

అనుమతులు ఏవి?

వ్యవసాయ భూములు, ప్రభుత్వ డ్రయిన్లు, కాల్వలు, నదీ, సముద్ర పరీవాహక ప్రాంతాల్లో మట్టి, బుసక తవ్వకాలకు మైనింగ్ అనుమతులు తప్పనిసరి. కానీ అవేమీలేకుండానే చాలా చోట్ల విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు ఎవ్వరూ అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో టిప్పర్లలో ఇసుక నింపుతున్నారు. పొక్లెయిన్‌తో తొమ్మిది డిప్పల ఇసుక లోడ్ చేయాలి. 20 టన్నుల లోడుతో వాహనంలో ఇసుక రవాణా చేయాలి. కానీ టిప్పర్లలో 15 డిప్పులు అంటే 35 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. దీన్ని మార్కెట్లో అధిక ధరలకు విక్రయించుకుని కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేల వరకు అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

మహారాజశ్రీ గౌరవ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, విజయవాడ

I.P.No.54/2022

Between :

గర్నెపూడి వెంకటేశ్వరరావు ... పిటీషనర్

మరియు

బత్తుల గోవర్ధన్ & 8 ఇతరులు .... రెస్పాండెంట్స్

To

1. Kolagani Rathaiah, Son of Adisheshu, Hindu, aged about 50 years, Business, Resident of Door No.9-247, Pedakakani, Guntur, Guntur District-522509.
2. Pilli Mounika, Wife of Anjaiah, Hindu, aged about 28 years Private Employee & Properties, R/o. D.No.8-23, Yerrabalem, Manglagiri Mandal, Guntur District-522503.
3. Sunrise City, Rep. by its Proprietor Srinivasa Rao, Father's Name not known to the Petitioner, Hindu, aged about 52 years, Business, D.No.27-6-31 Praksam Road, Opp: SBI Bank, Vijayawada-520002.
4. Karthik Agencies, Rep. by its Proprietor, Door No.29-37-88, Near Vijaya Talkies Centre, Eluru Road, Vijayawada-520002.
5. Prathipati Madhavi, Wife of Venu, Hindu, aged about 32 years, Home Maker & Properties, Resident of Door No.42-14-1636, Madhirala Colony, 8t" Line, Kakani Road, Guntur, Guntur District-522001.
6. Moturi Santha, W/o. Nagaraju, Hindu, aged about 35 years, Home Maker & Properties, R/o. D.No.8-23, Yarrabalem, Mangalagiri Mandal, Guntur District-522503.
7. Kunchala Kalyan, S/o. Srinivasa Rao, Hindu, aged about 35 years, Finance Business, R/o. D.No.4-16-296, Potti Sriramulu Nagar, Guntur, Guntur District-522002.

పై నెంబరు పిటీషన్ నందు పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ మీపై పిటీషన్ దాఖలు చేసియున్నారు. అయితే సదరు పిటీషన్ నందు మీ హాజరు నిమిత్తం మీకు కోర్టు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టువారి ఆదేశముల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వడం జరిగినది. కావున మీరు ది. 09-03-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, మీ అడ్వకేటుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకొన వలసియున్నది. లేనిచో మీ పరోక్షమున పై పిటీషను తీర్మానం చేయబడునని యిందుమూలము గా తెలియజేయడమైనది.

వాయిదాతేది : 09-03-2023

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు
కంచర్ల త్రినాథ్ కుమార్,
పీతా శ్రీకాంత్ వర్మ,
న్యాయవాదులు, విజయవాడ-520015.
సెల్ : 99080 15980

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, గుడివాడ

ఇ.పి. 36/2022 ఇన్ ఓ.యస్. 241/2016

బిట్వీన్ :

నక్క వెంకటేశ్వరరావు, తండ్రి రాఘవులు, కపిలేశ్వరపురం గ్రామం, పమిడిముక్కల మండలం .... డి.హెచ్.ఆర్.

మరియు

కంటె నాగప్రసాద్, తండ్రి నాగేంద్రరావు, డోర్ నెం. 16-171, కోటిరెడ్డిపేట, పామర్రు గ్రామం, పామర్రు మండలం, ... జె.డి.ఆర్.

పై నెంబరు ఇ.పి.లో శ్రీ కోర్టువారు సి.పి.సి ఆర్డరు 21 రూరల్ 54 క్రింద కోర్టు వారిచే జారీ చేయబడిన నోటీసును జె.డి.ఆర్.కు పేపరు ప్రకటన ద్వారా అమలు చేయుటకు శ్రీ కోర్టువారు ఉత్తర్వులను జారీచేసి జె.డి.ఆర్. హాజరు అగుటకు ఇ.పి.ని ది. 17-3-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన జె.డి.ఆర్. స్వయంగా గాని, వారి అడ్వకేటుగారి ద్వారా గాని ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో పై తేదీన హాజరు కావలయును. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల ఇ.పి.ని జె.డి.ఆర్ పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ
తేది: 26-2-2023

ఎస్.వి.పాండురంగారావు,
అడ్వకేట్, గుడివాడ.

గ్రామపంచాయతీ కార్యాలయం, చిన ఓగిరాల

ఉయ్యూరు మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 11/2023 **తేది : 03-03-2023**

కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలం, చిన ఓగిరాల గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై పనిచేఉటకు ది. 01-04-2023 నుండి ది.31-3-2024 వరకు ఈ దిగువ తెలిపిన పనులు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై పనిచేయుటకు ది. 23-03-2023 ఉదయం 11 గం.ల నుండి 12 గం.ల వరకు చిన ఓగిరాల గ్రామపంచాయతీ కార్యాలయం నందు సీల్డు టెండర్లు పంచాయతీ కార్యదర్శి గారిచేగాని, లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2.30 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరములు	పనికాలము	ధరావత్తు
1.	గ్రామంలో పారిశుధ్య నిర్వహణ-6 వ్యక్తుల సేవలు	ది.1-4-2023 నుండి ది.31-3-2024 వరకు	రూ.1000/-
2.	గ్రామంలో పి.డబ్ల్యూ.ఎస్. స్కీమ్-2 వ్యక్తుల సేవలు	"	రూ.1000/-
3.	గ్రామంలో వీధి దీపముల నిర్వహణ-1 వ్యక్తుల సేవలు	"	రూ.1000/-

నోట్ : గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి జీతములు చెల్లించబడును.

సం/- శ్రీమతి వై.శిరీష,
సర్పంచ్,
చిన ఓగిరాల గ్రామపంచాయతీ

సం/- కె.శ్రీనివాసరావు
పంచాయతీ కార్యదర్శి
చిన ఓగిరాల గ్రామపంచాయతీ

గ్రామ పంచాయతీ కార్యాలయం-చోడవరం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 55/2023 **తేది: 04-03-2023**

పెనమలూరు మండలము, చోడవరం గ్రామ పంచాయతీ నందు ఈ దిగువ తెల్పిన పనులు నిర్వహించుటకు గాను కాంట్రాక్టు లేబరు ఏజెన్సీ పద్ధతి ద్వారా తీసుకొనుటకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 10-03-2023న గురువారం మధ్యాహ్నము 12.00 గంటకు కార్యదర్శి గారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని పంచాయితీ కార్యాలయములో టెండర్లు స్వీకరించబడును. తదుపరి మధ్యాహ్నము 1-00 గంటలకు హాజరైన టెండరు దార్ల సమక్షములో టెండర్లు తెరువబడును. కావున టెండరు షరతులు టెండరు ఫారములు ఇతర వివరములకు కార్యాలయము పని చేయు వేళల్లో తీసుకోవచ్చును.

వ.నెం.	పని వారి వివరములు	పనివారి సంఖ్య	టెండరు డిపాజిట్ రూ.	కాల పరిమితి
1.	పారిశుద్య పనుల కొరకు	11	ఏజెన్సీ పద్ధతి పై సప్లై చేయుట డిపాజిట్ రు. 5000/-లు (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)	01-04-2023 నుండి 31-3-2024 వరకు (ఒక సంవత్సర కాలము
2.	వాటరు సప్లై ట్యాంక్ వాచర్లు కం. ఆపరేటర్లు	3		
3.	ఎలక్ట్రీషియన్	1		
4.	ఇ ఆటో డ్రైవర్	3		
	మొత్తం	18		

బి.శ్రీనివాసరావు
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, చోడవరం

గ్రామపంచాయతీ కార్యాలయం- రాయనపాడు

టెండరు ప్రకటన

ఎన్‌టిఆర్‌జిల్లా, విజయవాడ రూరల్ మండలం, రాయనపాడు గ్రామపంచాయతీకి కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై పంచాయతీ పనులను ఈ క్రింది తెలిపిన విధంగా ది.1-4-2023 నుండి 31-3-2024 వరకు సీల్డు టెండర్లను శ్రీ యుత సర్పంచ్ వారిచేగాని, కార్యదర్శి గారిచేగాని ది.16-03-2023, ఉదయం 11.00 గం.లకు టెండర్లను స్వీకరించబడును. అదేరోజు సాయంత్రం 3.00 గం.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. దిగువ తెలిపిన ధరావత్తును చెల్లించి రశీదును అర్జీనకు జతపరచవలెను. మిగిలిన వివరాలు కార్యాలయ పనిచేయు వేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పనివివరము	కావల్సిన వారు	కాలపరిమితి	ధరావత్తు
1.	మంచినీటి సరఫరా ట్యాంక్ ఆపరేటర్	3 (ముగ్గురు)	ది.1-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1500/-
2.	ప్రజారోగ్యం పారిశుధ్యం నిమిత్తం	18 (పద్దెనిమిది)	.1-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.9000/-
3.	వీధి దీపముల నిర్వహణ	2 (ఇద్దరు)	.1-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/-

గమనిక : గతంలో పనులను చేయుచున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

శ్రీమతి కాటంనేని కల్యాణి
సర్పంచ్
గ్రామపంచాయతీ, రాయనపాడు.

ఎం.స్వరూపరాణి
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, రాయనపాడు

గ్రామపంచాయతీ కార్యాలయం - పైడూరుపాడు

టెండరు ప్రకటన

ఎన్‌టిఆర్‌జిల్లా, విజయవాడ రూరల్ మండలం, పైడూరుపాడు గ్రామపంచాయతీకి కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై పంచాయతీ పనులను ఈ క్రింది తెలిపిన విధంగా ది.1-4-2023 నుండి 31-3-2024 వరకు సీల్డు టెండర్లను శ్రీ యుత సర్పంచ్ వారిచేగాని కార్యదర్శి గారిచేగాని ది.15-03-2023, ఉదయం 11.00 గం.లకు టెండర్లను స్వీకరించబడును. అదేరోజు సాయంత్రం 3.00 గం.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. దిగువ తెలిపిన ధరావత్తును చెల్లించి రశీదును అర్జీనకు జతపరచవలెను. మిగిలిన వివరాలు కార్యాలయ పనిచేయు వేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పనివివరము	కావల్సిన వారు	కాలపరిమితి	ధరావత్తు
1.	మంచినీటి సరఫరా ట్యాంక్ ఆపరేటర్	2 (ఇద్దరు)	ది.1-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/-
2.	ప్రజారోగ్యం పారిశుధ్యం నిమిత్తం	3 (ముగ్గురు)	.1-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1500/-

గమనిక : గతంలో పనులను చేయుచున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

శ్రీ వేముల సీతారామయ్య,
సర్పంచ్
గ్రామపంచాయతీ, పైడూరుపాడు

ఎం.స్వరూపరాణి
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, పైడూరుపాడు

సత్యనారాయణకు బుద్ధ ప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నపరెడ్డి సత్యనారాయణను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పరామర్శించారు. ఆదివారం సత్యనారాయణ సతీమణి సుఖవేణి అమ్మ అకాల మరణం చెందడంతో సోమవారం బుద్ధప్రసాద్ సత్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి ఆయనకు ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వ రరావు, టిడిపి నాయకులు ఘంటసాల రాజమోహన్రావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, కోటసాయి కష్ణ తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుడివాడ : ఏపిటిఎఫ్ అధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సోవేశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.వి రామరావులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులుకు చెందిన 17 సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు సిపిఎస్ రద్దు చేయాలని, 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేయాలని, 12వ వేతన సంఘాన్ని నియమించాలని కోరుతు వినతిపత్రాన్ని తాహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.సత్యనారయణ, వి.మోహనరావు, శ్రీనివాసరావు. జోన్సన్‌బాబు, శ్రీధర్, శాంతకుమారి, కుటుంబరావు. భాస్కరరావు పాల్గొన్నారు.

లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ కూల్చివేత తగదు

ప్రజాశక్తి-గుడివాడ : ఎంతో కలంగా ప్రజలకు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ఉచితంగా నేత్ర, దంత చికిత్సలు అందిస్తున్న లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌ను రోడ్డుకు అండగా ఉందని కూల్చివేయలనుకోవడం దారుణమని లయన్స్‌క్లబ్ సభ్యులు అవేదన వ్యక్తం చేస్తూ సోమవారం అర్‌డివో కార్యాలయం వద్ద అందోళన కార్యక్రమాన్ని నిర్వహించి అర్‌డివోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు సుబ్రహ్మణే శ్వరరావు, సోమూరి వెంకట్రావ్ తదితరలు మాట్లాడుతూ బొమ్ములూరులోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ కూల్చివేతకు అధికారుల నోటీసులు ఇవ్వడం బాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మోడీ నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని సోమవారం తోట్లవల్లూరులో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందని, ఒకపక్క పనులు లేక మరోపక్క నిరుద్యోగం పెరిగి భారత్ పరిస్థితి దిగజారిందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను సొంత లాభం కోసం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి ప్రభుత్వ రంగాన్ని నెరవేర్యం చేశారని అన్నారు. తన అనునాయులకు బ్యాంకులలో రుణాలు మాఫీ చేసి విదేశాలకు పంపించడంలో తన వంతు సహాయం ఎల్లప్పుడూ చేస్తున్నాడని దుయ్యబట్టారు. కార్మిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని మోడీ నీరు కారుస్తున్నారని అన్నారు.దీనికి నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం

మాట్లాడుతున్న ఆర్.రఘు

చేపడుతున్నామని, ప్రజా ప్రజలంతా ఈ కార్యక్రమానికి సహకరించి పెద్ద ఎత్తున తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌల్ రైతు సంఘం అధ్యక్షులు కే శివ నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సేలం ప్రకాష్ రావు, వీరంకి శ్రీనివాసరావు, అంబటి శ్రీను ఈ కరపత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిత్యనూతనం నర్తనశాల నృత్యరూపకం

- ఆకట్టుకున్న దశావతార శబ్దం

ప్రజాశక్తి - మొవ్వ : కూచిపూడి లోని సిద్దేంద్ర యోగి నాట్యకళావేదికపై కొనసాగుతున్న 'కళోత్సవం'లో భాగంగా ఐదవ రోజైన సోమవారం సాయంత్రం పలువురు కళాకారుల ప్రదర్శనాంశాలు అలరింపజేశాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం ప్రధానాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు కళారత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి రచించి నత్య దర్శకత్వం వహించి అభినయించిన 'నర్తనశాల నత్య'రూపకం తలమానికంగా నిలిచింది. ఆయన ప్రతినాయక పాత్రధారి కీచకునిగా ప్రదర్శించిన హావభావాలు ఔరా అనిపించాయి. భీమునిగా బాలసుబ్రమణ్యం, విరాటునిగా ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు, ద్రౌపదిగా సుశీల, ధర్మరాజుగా తేజ, బహన్నలగా వేదాంతం మోహన సత్య శ్రీనివాస వాగ్దేవి ప్రసాద్, ఉత్తరగా త్రిపుర, సుధేష్ణగాభారతిలు నటించారు. తొలుత వేదాంతం దత్తాత్రేయ ఘనాపాటి వేద ప్రవచనం, ముట్నూరి పావని గాత్రగచేరినిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ (ప్రొద్దుటూరు) బందం

బాలాత్రిపురసుందరి, జ్ఞాన సరస్వతి డాన్స్ అకాడమీ వాణి రమణ బందం తమ శిష్యులతో ప్రదర్శించిన దశావతార శబ్దం పురాణ ఇతిహాసాలను జ్ఞప్తికి తెచ్చి అదరహో అనిపించాయి. అలాగే బిస్మిల్లాఖాన్.యువ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ వసంత్ కిరణ్ రాయసం శిష్య బందం ప్రదర్శించిన మార్చుబర దర్శనం ఆకట్టుకున్నాయి. కళాకారులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, అంగవస్త్రం, జ్ఞాపికలతో సత్కరించారు. జోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంబించారు.బ్రహ్మశ్రీ వేదాంతం దత్తాత్రేయ ఘనాపాటి వేదప్రవచనం ,ముట్నూరి పావని గాత్రకచేరి అలరించాయి.కళారత్న వేదాంతం రాధేశ్యామ్ నిర్వహించగా బాలా త్రిపుర సుందరి గ్రంథాలయ పాలకులు వై.వి ఫణికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట-రామచంద్రునిపేట గ్రామాల మధ్యలో స్వయంభుగా వెలసిన శ్రీ రాధా రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి దేవాలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చక బందం వైభవోపేతంగా నిర్వహించారు. రామచంద్రుని పేట గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపం వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద

సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా ఆనవాయితీగా స్వామివారి కళ్యాణాన్ని పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు జొన్నాబట్ల సతీష్ శర్మ తెలియజేశారు. దేవాలయ చైర్మన్ ఏడుకొండలు పర్యవేక్షణలో రామచంద్రుని పేట గ్రామ సర్పంచ్ మద్దుల రామకష్ణ దంపతులతో పాటు మరికొన్ని జంటలు పీటలపై కూర్చొని కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. మహా అన్నదాన కార్యక్రమానికి షేర్ మహమ్మద్ పేట, రామచంద్రుని పేట గ్రామాలకు సంబంధించిన యువత సహకారంతో నిర్వహించారు.

ఈకెవైసి నూరు శాతం పూర్తి చేయాలి : జెసి

అర్జీలు స్వీకరిస్తున్న జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఈ-క్రాప్ నమోదు, రైతుల ఆదాంటికేషన్ ఈకెవైసి నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ వ్యవ సాయా శాఖధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, కె.ఆర్‌ఆర్ సి డిప్యూటి కలెక్టర్ బి. శివ నారాయణ రెడ్డి కూడా స్పందన అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన పెండింగ్ అర్జీలతో పాటు జగనన్నకు చెబుదాం అర్జీలు పెండింగ్ అధికారుల వారీ సమీక్షించారు. పెండింగ్ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఈ-క్రాప్ నమోదు గురించి జెసి సమీక్షిస్తూ రైతుల ఆదాంటికేషన్ ఈకెవైసి నూరు శాతం పూర్తి చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాశిశు అభివద్ధి సంక్షేమశాఖ (ఐసిడిఎస్) ద్వారా జిల్లా అధికారుల్లో మహిళా అధికారులకు రన్నింగ్, షటిల్, స్పీడ్వాక్, లెమన్ అండ్ స్పూన్ టెన్నికాయిట్ వంటి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు, మహిళా అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపివో వై. శ్రీలత, డిఎం అండ్ హెచ్ వో డా. గీతాబాయి, ఐసిడిఎస్ పీడి ఎస్. సువర్గ, డిఎల్డీఓ సుబ్బారావు, సర్వే ఎడి గోపాల్ రాజ్, డిఆర్ డిఎ పిడి పీఎస్‌ఆర్ ప్రసాద్, డిఇవో తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

అర్జునుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

క్రమశిక్షణకు మారుపేరు 'బచ్చుల'

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో దివంగత నేత గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఎంఎల్సీ బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అకాల మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, ఆయన క్రమశిక్షణ కలిగిన నాయకుడని, ఏ పదవి ఇచ్చినా తనకంటూ గుర్తింపు సాధించడంలో అర్జునుడు ప్రత్యేకమన్నారు. మూడు సంవత్సరాలుగా గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా పార్టీ అభివద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అర్జునుడికి నివాళులు అర్పించిన వారిలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కష్ణారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొవ్వ వేణుగోపాల్, ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కసుకుర్తి అర్జునరావు, కాట్రు పాపారావు, కొలుసు గంగాజలం, తదితరులు ఉన్నారు.

గోడౌన్లో అగ్నిప్రమాదం

- రూ.35 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలోని డాల్ఫిన్ బార్ రోడ్డులో ఈనెల 5వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గృహోపకరణాల గోడౌన్‌లలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ. 35 లక్షల ఆస్టి నష్టం జరిగిందని నిర్వాహకులు సోమవారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ వన్‌టౌన్, మేకలవారి వీధి, పాత ఎస్‌బిఐ బిల్డింగ్, రెండవ ఫ్లోర్ నందు అశోక్ కుమార్ జైన్ కుటుంబం నివాసం వుంటున్నారు. ఆయన వన్‌టౌన్ ఇమాం పంజా వీధి నందు 'సుమిత్ స్మార్ట్ కిచెన్' అను పేరుతో హోమ్ అప్లయన్స్ వ్యాపారం చేస్తుంటాడు. దానికి సంబంధించిన గోడౌన్ భవానీపురం డాల్ఫిన్ బార్ రోడ్‌లో గల ఓ బిల్డింగ్ మొదటి అంతస్తులో నిర్వహిస్తున్నారు. ఈనెల 5వ తేదీన గోడౌన్స్ నుంచి పొగరావడంతో వెళ్లి చూడగా హోమ్ అప్లయన్స్ కాలిపోయాయని, అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి వుంటుందని భావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

శ్రీనివాస్‌కు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - భవానీపురం : ముఖ్యమంత్రి జగనన్న సారధ్యంలో ఏపీ శరవేగంగా అభివృద్ధిచెందుతోందని వైసీపీ నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ అన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ పార్టీలో చేరిన సందర్భంగా సోమవారం భవానీపురంలో ఉన్న ఆయన కార్యాలయంలో పలువురు ఆకులను కలిసి శాలువాకప్పి అభినందనలు తెలియ చేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వైఎస్సార్‌పార్టీతోనే రాష్ట్రాభివద్ధి సాధ్యమని అన్నారు. ఇప్పటికే విద్యా. వైద్యం విషయంలో దేశంలోనే ఏపి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వం చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేక నెలకు వెయ్యి రూపాయలు నిరుద్యోగ భతి ఇచ్చి వాళ్లని ముందుకు వెళ్ళనీయకుండా నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సచివాలయాలు ద్వార లక్షలాది మందికి ఉపాధి చూపించారని కొనియాడారు. అంతే కాకుండా ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్ ఏర్పాటు చేసి వందలాదిమంది పారిశ్రామికవేత్త లను రాష్ట్రానికి రప్పించి అనేక పరిశ్రమల ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగాలు కోసం ఒప్పందాలు కుదిర్చారని అన్నారు.

విశాఖ సదస్సు విజయవంతంపై సంబరాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విశాఖ గ్లోబల్ సదస్సు విజయవంతం అయిన నేపథ్యంలో స్థానిక భవానీపురం ఎన్టీఆర్ జిల్లా వైసిపి కార్యాలయం వద్ద మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పులమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వైకాపా నాయకులతో కలసి బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండపల్లి బుజ్జి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ళ విద్యాధరరావు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుపై ఆరుగురికి నోటీసులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మాజీ సర్పంచ్ సామినేని విశ్వనాథం విగ్రహం ఏర్పాటుపై సోమవారం ఆర్‌అండ్‌బి ప్రిన్సిపుల్ సెక్రటరీతో సహా ఆరుగురికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. జగ్గయ్యపేట బస్టాండ్‌లో సామినేని విశ్వనాథం విగ్రహం ఏర్పాటుపై రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. హైకోర్టులో సోమవారం వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో మేనేజర్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానులకు నోటీసులు జారీ చేశారు.

మాదకద్రవ్యాలు అమ్మితే రౌడీషీట్ : ఎసిపి

ప్రజాశక్తి-మైలవరం: మాదకద్రవ్యాలు అమ్మినట్లు తెలిస్తే వారిపై రౌడీ షీట్ తెరుస్తామని మైలవరం ఏసిపి ఎం.రమేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులోని రియల్ ఎస్టేట్ లేఔట్‌లో గ్రామానికి చెందిన రాజేష్, సందీప్ గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్, ఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

'ఇసుకను అందుబాట్లోకి తేవాలి'

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చి తాపీ కార్మికులను ఆదుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి నరసింహారావు, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో ఎ.కొండూరు మండలం భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇనుము, సిమెంటు ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్యులు ఇల్లు నిర్మించుకోలేకపోతున్నారని అన్నారు. దీంతో తాపీ కార్మికులు పనుల కొరకు వలస వెళ్లి జీవించవలసి వస్తుందని అన్నారు. తాపీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏ కొండూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షునిగా కోమటి చెన్నారావు, ప్రధాన కార్యదర్శిగా పంబి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, గౌరవాధ్యక్షులుగా జట్టి వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులుగా సిద్ధం విజయరావుతోపాటు 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న పిల్లి నరసింహారావు

అర్జీదారులకు నమ్మకం కలిగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల సమస్యలను పరిష్కరించాలనే దృక్పదం కలిగినప్పుడే పరిష్కార మార్గాలు దొరుకుతాయని అటువంటి ఆలోచన దోరణి అధికారులలో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలనే దృక్పదం కలిగిన్నపుడు సమస్య పరిష్కారానికి మార్గాలు లభిస్తాయని అటువంటి ఆలోచనా దోరణి అధికారులలో కలగాలన్నారు. అర్జీదారుడు తన సమస్యను స్పందన ద్వారా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారమవుతాయనే ఆశతో వస్తారన్నారు. ప్రజలకు స్పందనపై ఉన్న నమ్మకాన్ని పెంచాలంటే అర్జీలకు సరైన శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. అర్జీదారుని నుండి అర్జీని స్వీకరించినప్పుడు దానిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను అర్థం చేసుకుని ఏ విధంగానైనా పరిష్కరించి అర్జీదారుని సంతృప్తి పరచాలనే దృక్పదంతో అధికారులు ఆలోచించినప్పుడే సంబంధిత సమస్యకు ఎదో ఒక చోట పరిష్కారం లభించక తప్పదన్నారు. స్పందనలో 90 వినతులు నమోదు కాగా వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 35, పోలీస్ 10, యంఎయుడి 07, ఏపిఎస్‌పిడిసిఎల్ 2, దేవదాయశాఖ 1, పంచాయతీరాజ్ 07, పశుసంవర్ధక శాఖ 2, సర్వే అండ్ సెటిలిమెంట్ 3, విద్యా శాఖ 1, మత్స్య శాఖ 4, వైద్య ఆరోగ్య శాఖ 4, పౌర సరఫరాల శాఖ 07, గనులు అండ్ భూగర్భ శాఖ 1, ఉపాధి కల్పన 1, ఖజాన 2, ఏపిఎస్‌ఆర్‌టిసి 1, విభిన్న ప్రతిభావంతుల శాఖ 2, శాఖలలో అర్జీలు నమోదయ్యాయన్నారు. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల యంపిడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ పరిష్కారమయ్యే వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. స్పందన కార్యక్రమంలో డిఎస్‌వో పి కోమలి పద్మ, ఐసిడిఎస్ పీడి జి. ఉమాదేవి, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, పశు సంర్ధక శాఖ జెడి కె. విద్యాసాగర్, డిసివో సిహెచ్ శైలజ, డిఆర్‌డిప పీడి కె. శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బాలాజీ కుమార్, హౌసింగ్ పీడి శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి యం. విజయభారతి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గౌతమ్ విద్యాసంస్థల రజతోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ గౌతమ్ విద్యా సంస్థల రజతోత్సవ వేడుకలు కబేళా బ్రాంచ్‌లో ఆదివారం రాత్రి అంగ రంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శ్రీ గౌతమ్ విద్యా సంస్థల డైరెక్టరు ఎన్. సూర్యారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సెంట్రల్ నియోజక వర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, 45వ డివిజన్ కార్పోరేటరు మైలవరపు మాధురీ లావణ్య, గొల్లపూడి ఎంపిటిసి ఎం.దుర్గారావు, బి.శివకుమార్ పట్నాయక్, పి.నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో, శ్రీ గౌతమ్ విద్యా సంస్థలలో చదివిన విద్యార్థులు అనేక రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. అతి తక్కువ ఫీజులతో అత్యున్నత విద్యాప్రమాణాలతో విద్యను అందచేయడం శ్రీ గౌతమ్ విద్యాసంస్థలకు సాధ్యమని మల్లాది అన్నారు. అతిథులు మాట్లాడిన తర్వాత విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల ప్రతిభకు సంబంధించిన పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అతిథుల చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ పి.తులసి పర్యవేక్షించగా, ఇన్‌చార్జిలు శ్రీరామ్, యమున, రేష్మా, ఉమ, మధులత, రమ పాల్గొన్నారు.

వెలంపల్లిని కలిసిన హబీబుల్లా

ప్రజాశక్తి-భవానీపురం

మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎం.డి. హబీబుల్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను జిల్లా వక్ఫ్‌బోర్డు డైరక్టర్‌గా నియమించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లాలను కూడా హబీబుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ కార్యక్రమంలో వైసీపీ సిటీ యూత్ జనరల్ సెక్రెటరీ చిచ్చా, మైనార్టీ నాయకులు దాదా తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 15 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం విశ్వ భారతి, శ్రీలక్ష్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు హాల్ టికెట్లను విమలభాను పౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కొమరగిరి పద్మ శేఖర్, మేనేజ్మెంట్ ప్రతినిధులు కిషోర్ కుమార్, నారాయణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూడలి విస్తరణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రోజురోజుకీ పెరిగిపోతున్న వాహనాల రద్దీ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జగ్గయ్యపేట పట్టణంలోని పద్మావతి నగర్ నందు జంక్షన్‌గా అటు జయంతిపురం, ఇటు ముక్త్యాల, జగ్గయ్యపేట మధ్యలో ఉన్న కూడలి విస్తీర్ణకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో 75 లక్షల రూపాయలతో జంక్షన్ సర్కులేషన్ ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఉదయభాను ఏర్పాటు పనులను పరిశీలించారు. మరొక రెండు మాసాల్లో పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఆయన తెలిపారు.

దోమల నివారణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ పరిధిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ చైర్ పర్సన్ స్పందించారు. వార్డుల్లో దోమల బెడద ఉన్నందున దోమల వద్ది నివారణకు పురపాలక సంఘ సాదారణ నిధుల నుండి 5 ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఫాగింగ్ మిషన్ల పని తీరును పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.శివ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన శతచండీ మహా రుద్రయాగం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో ఈ నెల 2వ తేదీ నుంచి జరుగుతున్న శత చండీ సహిత మహా రుద్రయాగం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. సోమవారం ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, కేసరి నాగమణి, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక సిబ్బంది కోటా ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కర్నాటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ మంత్రి, దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ వైదిక కమిటీ సభ్యుల వారి సూచనల మేరకు లోకకళ్యాణార్థం శత చండీ సహిత మహారుద్రయాగం నిర్వహించినట్లు తెలిపారు.

కలెక్టర్, సిపిలను కలిసిన పాలకవర్గం

దుర్గగుడి కర్నాటి రాంబాబు, పాలకమండలి సభ్యులు సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, నగర పోలీసు కమిషనర్ క్రాంతిరాణా టాటాను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తయ్య, దేవిశెట్టి బాలకష్ణ, కేసరి నాగమణి, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కంచికచర్ల

రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కీసర టోల్ ప్లాజా సమీపంలో సోమవారం అదే గ్రామానికి చెందిన కస్తాల శివప్రసాద్ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న లారీ బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తీవ్రంగా గాయపడగా రహదారి అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రసాద్ ను మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు కంచికచర్ల పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.